29-3-79 ప్రభ




# రాముడి తెలివి

జి. రామలక్ష్మి

యమునా నదీ తీరంలో ఒక చిన్న గ్రామం ఉంది. ఆ గ్రామంలో ఒక వయసు మళ్ళిన ముసలమ్మ ఉంది. ఆమెకు ఒక కొడుకూ, ఒక కూతురూ ఉన్నారు. కొడుకు పేరు రాముడు, కూతురు పేరు వనజ. కూతురికి వివాహం చేయడంకోసం ఆ ముసలమ్మ ఎంతో కాలంనుంచి కష్టపడి పనిచేస్తూ, కూడబెట్టిన డబ్బు ఒక సంచీలో దాస్తూ వచ్చింది.

అది తెలిసిన ఒక దొంగ ఒకనాడు ఎవ్వరూ లేని సమయం చూసి ఇంట్లో దూరబడి ఆ డబ్బున్న సంచీని కాజేశాడు. తన సంచీ కనపడక పోవటంతో ఆ ముసలమ్మ లబో దిబోమని ఏడవసాగింది.

తల్లిని ఓదారుస్తూ రాముడు, "అమ్మా! ఏడవకమ్మా! ఎలాగయినా ఆ దొంగను పట్టుకుని, ఎలాగయినా సరే మన సొమ్మును తీసుకువస్తాను. అంతవరకు నేను ఇంటికి వస్తే, నా పేరు రాముడే కాదు!" అని చెప్పి, తల్లి ఎంత చెప్పినా వినకుండా బయలుదేరాడు.

అలా అతడు చాలాదూరం వెళ్ళి వెళ్ళి ఒక చెటునీడన ఉన్న బావి గటుమీద కూచున్నాడు. అంతలో వెతకబోయిన తీగ కాలికే చుట్టుకుందన్నట్లుగా దొంగ తను కాజేసిన ముసలమ్మ సంచీని ఆనందంగా ఊపుకుంటూ ఆ దారినే రాసాగాడు. ఆ దొంగ ఇలు కూడా ఆ దారినే ఉంది. ఆ దొంగ చేతిలో తమ డబ్బుగల సంచీని చూసి, 'దొంగవెధవా, మా డబ్బు కాజేసింది కాక హుషారుగా ఊపుకుంటూ పోతున్నావా? ఉండు నీ పని పడతాను!' అని అనుకుని, గట్టిగా రాగాలు తీస్తూ దొంగకు వినిపించేలా ఏడవటం మొదలు పెట్టాడు.

అది విని దొంగ వెనక్కు వచ్చి, "ఎందుకు బాబూ ఏడుస్తున్నావు? ఏం జరిగింది?" అని అడిగాడు ఆత్రుతగా.

"మా అమ్మ ఒక బంగారు గొలుసు ఇచ్చి, దానిని అమ్మి డబ్బు తీసుకు రమ్మంది. నడచినడచి వస్తూంటే దారిలో ఈ బావి కనబడింది. ఇందులో నీళ్ళున్నాయో లేవోనని తొంగిచూశాను. ఇంతలో ఆ గొలుసు కాస్తా నా జేబులోంచి జారి ఈ బావిలో పడింది. అది రెండువేలు విలువ చేసే గొలుసు. అది లేకుండా నేను బజారుకు వెళ్ళలేను. బజారులో దానిని అమ్మి సొమ్ము తేకపోతే మా అమ్మ నన్ను చంపేస్తుంది" అంటూ మళ్ళీ ఏడవసాగాడు.

అది విని 'అబ్బ ఈ వేళ నేను లేచిన వేళా చాలా మంచిదిలా ఉంది. అవతల ఆ డబ్బు. ఇక్కడ ఈ గొలుసు వారెవ్వా! నా అదృష్టం పండింది. ఎలాగయినా ఈ బావిలోకి దిగి ఆ గొలుసును వెతికి దాచేసి దొరకలేదని చెప్తేసరి. వాడు ఏడుస్తూ వెళ్ళిపోతాడు. అప్పుడు నేను తీసేసుకోవచ్చు!' అని అనుకుని సంతోషపడాడు.

"ఈ సంచీని, నా బట్టలను జాగ్రత్తగా చూస్తుండు! నేను బావిలోకి దిగి నీ గొలుసు ఉందేమో చూసి తీసుకు వస్తాను సరేనా?" అని చెప్పి బట్టలూ, డబ్బు సంచీ. రాముడు చిన్న పిల్లాడేకదా అని నమ్మి ఇచ్చి, గోచీ కట్టుకుని బావిలోకి దిగాడు! తన ఎత్తు పారిందని రాముడు చాలా సంతోషించాడు. ఆ దొంగ లోపలికి దిగిన వెంటనే రాముడు ఆ సంచీ తెరిచి చూశాడు. డబ్బు సరిగ్గానే ఉంది. వెంటనే ఆ సంచీని బట్టలను తీసుకుని ఆగకుండా కాలి సత్తువ కొద్దీ పరుగు తీశాడు.

ఎంత వెదికినా బావిలో గొలుసు కనబడక పోయేసరికి విసుగెత్తి దొంగ పైకి వచ్చేశాడు. పైకి వచ్చి చూసేసరికి వాడి గుండె గుబేలు మంది. అక్కడ ఆ పిలాడూ లేడు, సంచీ లేదు. కనీసం బట్టలు కూడా లేవు! అయ్యో ఆశకు పోయి ఉన్నదికూడా పోగొట్టుకున్నానే. చివరికి ఒంటిమీద గుడలు కూడా పోయాయే! అని విచారించి, తన దారిన తాను వెళ్ళిపోయాడు.

రాముడు సంతోషంతో ఇంటికి వచ్చి తల్లిని పిలిచి జరిగిందంతా చెప్పాడు.

కొడుకు తెలివికి ఆ ముసలమ్మ ఎంతగానో ఆనందించింది!! ★